క్లుప్తంగా

ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈవో రఘుపతి

కోనరావుపేట: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఈవో దూస రఘుపతి మాట్లాడుతూ తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు మౌలిక భాష, గణిత సామర్థ్యాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. తద్వారా విద్యార్థులలో వీటిని అభివృద్ధి చేసేందుకు శిక్షణ ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి లోకిని శారద, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు స్వప్న, మండల రిసోర్స్ పర్సన్లు నూగూరి దేవేందర్, జక్కని నవీన్, గొంటి రవీందర్, దుమాల రమానాథ్‌రెడ్డి, సత్తు రవీందర్ పాల్గొన్నారు.

తాళ్ళల్లపల్లెను గ్రామపంచాయతీ చేయొద్దు



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఇల్లంతకుంట: మండలంలోని రేపాక గ్రామం నుంచి తాళ్ళల్లపల్లి గ్రామాన్ని వేరు చేయొద్దని తాళ్ళల్లపల్లి గ్రామస్తులు మంగళవారం ఎమ్మార్వో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. కొందరు రాజకీయ స్వార్థం కోసం తమ గ్రామాన్ని వేరుచేస్తున్నారని అన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమ్మెలో పాల్గొన్న జీపీ కార్మికులు

బోయినపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు సమ్మెకు సీఐటీయూ మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ మంగళవారం మద్దతు పలికారు. కార్యక్రమంలో అక్కెనపెల్లి లక్ష్మణ్, తడగొండ బాబు, సుమన్, నరేశ్, మల్లేశం, కమలాకర్ పాల్గొన్నారు.

అప్పుల్లోకి నెట్టేసిన సొంతింటి కల

- బిల్లులు ఇప్పిస్తామని హామీ
- ఏడాదిగా బిల్లులకు నోచుకోని లబ్ధిదారులు
- అప్పు చేసి ఇళ్ల నిర్మాణాలు
- అయోమయంలో లబ్ధిదారులు



పై చిత్రంలో ఇంటి నిర్మాణం పూర్తిచేసుకుని దీనంగా చూస్తున్న దంపతుల పేర్లు గడ్డమీది రమేశ్, రేఖ. వీరిది తెర్లుమద్ది గ్రామం. అద్దె ఇంట్లో జీవించే రమేశ్‌కు డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరైంది. కాంట్రాక్టర్ కట్టకపోవడంతో, నాయకులు సూచన మేరకు ఇల్లు కట్టుకోవాలని భావించాడు. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో రేఖ మెడలోని పుస్తెలు, ఇతర ఆభరణాలను ఆరున్నర తులాలను యూనియన్ బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రుణం తీసుకున్నాడు. అలా పనులు మొదలు పెట్టిన రమేశ్‌కు ఐదు విడతల్లో రావాల్సిన బిల్లుల్లో ఒకటి కూడా రాలేదు. ఇక ఇల్లును ఎలాగైనా పూర్తిచేయాలని రూ.12 లక్షలు అప్పు చేశాడు. ఇల్లు పూర్తయిన ఒక్క బిల్లు రాకపోవడం, అప్పులిచ్చిన వారు అడుగుతుండడంతో రమేశ్ బిక్కమొఖం వేస్తున్నాడు. ఏడాదిగా రమేశ్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్నాడు. గీత కార్మికుడిగా పని చేసే రమేశ్‌లాంటి వారు మండలంలో ఇంకా ఉన్నారు.





తెర్లుమద్దిలో డబ్బులు లేక స్లాబ్‌లెవెల్లో నిలిపివేసిన డబుల్ ఇళ్లు

ముస్తాబాద్: సొంతింటి కళ వారిని అప్పుల పాలు చేసింది. డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులుగా ఎంపికై ఇళ్లు మంజూరు కావడంతో, ఇక తమకు ఢోకా లేదని భావించారు. కాని కాంట్రాక్టర్ చేతులెత్తేయడంతో వీరి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మంజూరైన ఇంటిని ఎలాగైనా కట్టుకోవాలన్న ఆలోచనతో అప్పులు తెచ్చి నిర్మించుకున్న ఇంటికి బిల్లులు రాక లబోదిబోమంటున్నారు. అప్పులిచ్చిన వారి ఒత్తిళ్లు తట్టుకోలేక, మిత్తిలు మీదపడి, సగంలో ఉన్న ఇంటిని పూర్తిగా కట్టుకోలేక ఆందోళన చెందుతున్నారు.

ముస్తాబాద్ మండలంలో ఏనిమిది గ్రామాల్లో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో లబ్ధిదారులను ఎంపిక చేసి, స్థలం వున్న వారు కట్టుకోవాలని ప్రజాప్రతినిధులు ప్రోత్సహించడంతో పేదలు, అప్పులు చేసి కొందరు, పుస్తెలు, బంగారం అమ్మి మరికొందరు, ఇళ్ల పనులు మొదలుపెట్టారు. ఏడాది గడిచిన రూపాయి బిల్లు రాకపోవడంతో ఏం చేయాలో పాలుపోలేక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆ ఏనిమిది గ్రామాల్లో..

ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి టెండర్ వేసింది. ఒక్కో ఇంటికి రూ.5.25 లక్షలు మంజూరు చేసింది. కాంట్రాక్టర్‌కు వర్క్‌వుట్ కాకపోవడంతో నాలుగేళ్ల క్రితం మంజూరైన ఇళ్లలో ఒక్కటి మొదలు పెట్టలేదు. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని సొంత జాగ ఉన్న వారినే కట్టుకునేలా ప్రోత్సహించారు. ఇలా తుర్కపల్లి, సేవాలాల్‌తండా, వెంకట్రావుపల్లె, బందనకల్, ఆవునూర్, తెర్లుమద్ది, చీకోడు, మొర్రాయిపల్లెలో 259 మంది ఇళ్లు మంజూరయ్యాయి. ఇక్కడ ముందే లబ్ధిదారులను ఎంపిక చేశారు. వారే సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేలా అధికారులతో మాట్లాడి పనులు మొదలు పెట్టారు. అలా 80 ఇళ్ల పనులు ప్రారంభించారు. ఇందులో ఐదు విడతల్లో అంటే ప్లింత్, స్లాబ్, బ్రిక్, ప్లాస్టరింగ్, ఫినిషింగ్ పనుల్లో జీఎస్టీ, సీనరేజీ పోను రూ.5.25 లక్షలకుగాను రూ.3.80 లక్షలు చెల్లించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే ఒక్క తుర్కపల్లిలో మాత్రమే రెండు విడతల్లో బిల్లులు చెల్లించారు. మిగతా గ్రామాల్లో రూపాయి బిల్లు రాలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీలు బిల్లులు చెల్లించాలని కలెక్టర్‌కు ఇటీవల వినతిపత్రం ఇచ్చారు. ఒక్క తెర్లుమద్దిలోనే 20 మందికి పైగా లబ్ధిదారులు 80 శాతం పనులు పూర్తి చేశారు. అయిన బిల్లులు చెల్లించలేదు. మంత్రి పీఎస్ శ్రీనివాస్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేసిన బిల్లులు రావడం లేదని ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాంట్రాక్టర్లు కాదన్నారని..

వెంకట్రావుపల్లె, సేవాలాల్‌తండా, బందనకల్, ఆవునూర్, తుర్కపల్లి, చీకోడు, మొర్రాయిపల్లె, తెర్లుమద్ది గ్రామాలకు మంజూరైన డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో కాంట్రాక్టర్లకు వచ్చే బిల్లులు, లబ్ధిదారులకు చెల్లించేలా ఏర్పాట్లు చేశారు. అప్పుడు ముందుకు వచ్చిన లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోవడం మొదలుపెట్టారు. కొన్నిచోట్ల నూరు శాతం ఇళ్లు కట్టుకున్నవారున్న వారికి బిల్లులు చెల్లించలేదు. చాలామంది లబ్ధిదారులు అప్పులు చేసి పనులు మొదలు పెట్టారు. సొంతింటి కలను నేరవేర్చుకునే క్రమంలో అప్పులపాలయ్యామని వాపోతున్నారు. సగంలో ఉన్న ఇళ్లను పూర్తిచేయలేక అద్దె ఇళ్లు, పాత ఇళ్లల్లో ఉండలేక అయోమయానికి గురవుతున్నారు.

మూడెకరాలు తాకట్టు పెట్టిన..



ఇల్లు కట్టుకుంటేనే లెక్క, లేకపోతే క్యాన్సిల్ అయితది అంటే మూడు ఎకరాలు బ్యాంక్‌లో తాకట్టు పెట్టి అప్పు తెచ్చుకున్న. ఇప్పటి వరకు రూపాయి బిల్ల రాలేదు. అడిగినప్పుడల్లా రేపు మాపు అంటున్నారు. ఈ ఇల్లును పూర్తి చేయాలంటే మరో పది లక్షలు కావాలే. ఇల్లు పూర్తిచేయక, అప్పు కట్టలేక బాధపడుతున్న.

– బైతి రాజయ్య, తెర్లుమద్ది

బంగారం కుదువ పెట్టిన



రెండున్నర తులాల బంగారం బ్యాంకులో కుదువపెట్టి పైసలు తెచ్చి ఇల్లు పనులు మొదలుపెట్టిన. ఏడాది నుంచి బిల్లులు వస్తాయని ఎదురుచూస్తున్న. స్లాబ్ వరకు పూర్తి చేసిన. ఇంకో ఆరు లక్షలైతే ఇల్లు కంప్లీట్ అయితది. అప్పులు మీద పడ్డవి. ఇల్లు కట్టక, రేకుల ఇంట్లో ఉండలేక ఇబ్బందులు పడుతున్న. కూలీ చేసుకునే నన్ను ఆదుకోవాలే.

– కొత్తపల్లి రాజు, తెర్లుమద్ది

మూడు రోజుల్లో బిల్లులు చెల్లిస్తాం



ఏప్రిల్ నెల వరకు రికార్డు అయిన ఇళ్లకు మూడు రోజుల్లో మొదటి బిల్లు చెల్లించేందుకు సిద్ధం చేశాం. తుర్కపల్లిలో కొంతమేరకు బిల్లులు ఇచ్చాం. తెర్లుమద్దిలో పెండింగ్‌లో ఉన్నాయి. వారి బిల్లులను ఇచ్చేందుకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. లబ్ధిదారులందరికీ వాయిదాల ప్రకారం బిల్లులు చెల్లించేలా చూస్తాం.

– నరేందర్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

మంత్రి కేటీఆర్ పర్యటనలో..

వేములవాడ ఏరియా ఆసుపత్రిలో మంగళవారం పలు ప్రారంభోత్సవాలు చేసేందుకు వచ్చిన మంత్రి కేటీఆర్‌తో ఆసుపత్రిలో పనిచేసే నర్సులు, వైద్య సిబ్బంది సెల్ఫీ దిగారు. అలాగే ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన ఓ చిన్నారిని మంత్రి పలుకరించారు. ఏదైనా పెద్ద సమస్య ఉంటే తమని సంప్రదించాలని తల్లి లక్ష్మికి సూచించారు. హైదరాబాద్‌లో మెరుగైన చికిత్స చేయిస్తానన్నారు. అలాగే ఆధ్యాగోలి ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ మోహన్ గోలి మంత్రిని కలుసుకుని పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. అలాగే వెజ్ మార్కెట్ ప్రారంభించి తిరిగివస్తున్న మంత్రి కేటీఆర్‌ను పక్కనే ఉన్న ప్రభుత్వ బాలికల హైస్కూల్ తరగతి గది కిటికీల్లోంచి ఆరో తరగతి విద్యార్థులు కేరింతలు కొడుతూ, విష్ చేస్తూ కనిపించారు. దీంతో వారి వద్దకు వెళ్లి ఏ తరగతి చదువుతున్నారు. టీచర్లు లేరా అని ప్రశ్నించారు. దీంతో వారందరూ ఒక్కసారిగా 'హాయ్ సార్, మేము మీ ఫ్యాన్..' అంటూ గట్టిగా అరవడంతో, మంత్రి చిరునవ్వు చిందిస్తూ, వారికి ఫ్లయింగ్ కిస్ ఇస్తూ ముందుకు సాగారు.

– వేములవాడ

సెల్ఫీ విత్ కేటీఆర్



మంత్రి కేటీఆర్‌తో సెల్ఫీ దిగుతున్న నర్సులు

నీ పేరేంటి నాన్న



చిన్నారిని పలుకరిస్తున్న మంత్రి కేటీఆర్

మేము మీ ఫ్యాన్ సార్



విద్యార్థులతో మాట్లాడుతున్న కేటీఆర్

నియామకం

శాలివాహన సంఘ కార్యవర్గం

కోనరావుపేట: మండల శాలివాహన యూత్ అధ్యక్షుడిగా వంగపెల్లి రాము, ప్రధానకార్యదర్శిగా పైడిపాల పర్శరాములు, ఉపాధ్యక్షుడిగా ఇద్దగిరి బాలకిషన్, కోశాధికారిగా వంగపెల్లి కిషన్, కార్యదర్శిగా దుంపటి ప్రదీప్, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్, అరవింద్, అజయ్, మనోహర్, వంశీ, సతీష్ ఎన్నికైనట్లు మండల కమిటీ అధ్యక్షుడు వంగపెల్లి పర్శరాములు, దేవరాజు, శోభన్ తెలిపారు.

మున్నూరుకాపు సంఘం

కోనరావుపేట: మండలం మల్కపేట గ్రామంలో మున్నూరుకాపు సంఘ అధ్యక్షుడిగా గోపు భూమయ్య ఎన్నికయ్యారు. మంగళవారం సమావేశమైన సంఘ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా వేల్పుల ఆనందం, ప్రధానకార్యదర్శిగా తాడు ప్రతాప్, కార్యదర్శిగా జంగిటి మల్లయ్య, కోశాధికారిగా గాజుల పర్శరాములు, గౌరవసభ్యులుగా ఆరె ఐలయ్య, బుట్టం దేవయ్య, జంగిటి బుగ్గయ్య, బుట్టం చంద్రయ్య ఎన్నికయ్యారు.

ప్రైవేటు స్కూళ్లలో ఫీజులు నియంత్రించాలి



వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్: మండలంలో ప్రైవేట్ స్కూళ్లలో అధిక ఫీజులను నియంత్రించాలని కాంగ్రెస్ నాయకులు ఆరుట్ల మహేశ్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రంజాని నరేశ్ విద్యాశాఖ అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల వివరాలను నోటీస్ బోర్డులపై ప్రదర్శించాలనే ఆదేశాలున్న ఎవరు పాటించడం లేదన్నారు. స్కూల్ యజమాన్యాలే బుక్స్, యూనిఫామ్స్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. గతేడాది ఫిర్యాదు చేసిన మండల విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోలేదని, తిరిగి ఈ విద్యా సంవత్సరం అవే పరిస్థితులు ఉన్నాయన్నారు. నిబంధనలు ఉల్లంఘించే స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. యూత్ పట్టణాధ్యక్షుడు విజయ్‌రెడ్డి, కొంరయ్య పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో మంగళవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శిబిరంలో 193 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించి, గాలికుంటు వ్యాధి నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ మిర్యాల ప్రభాకర్‌రావు, సర్పంచ్ అనుపాటి భారతి, ఏఎంసీ కార్యదర్శి, డైరెక్టర్ వుచిడి రాజిరెడ్డి, డెయిరీ చైర్మన్ జిల్లెల్ల లక్ష్మారెడ్డి, ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు అందెం నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ బాపురెడ్డి, వైద్యాధికారి అంజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్తాబాద్‌కు బీసీ రుణాలు రెండు యూనిట్లా?

ముస్తాబాద్: ముస్తాబాద్ మేజర్ పంచాయతీకి బీసీ రూ.లక్ష రుణాలు రెండు యూనిట్లు మాత్రమే మంజూరు చేయడం సరికాదని సర్పంచ్ గాండ్ల సుమతి, ఉపసర్పంచ్ రవీందర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు రమేశ్‌రెడ్డి, సంతోష్‌రావు అన్నారు. ముస్తాబాద్ మేజర్ పంచాయతీలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 12 వేల మంది జనాభాగల ముస్తాబాద్ పట్టణంలో 300కు పైగా యువకులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. చిన్న గ్రామాలకు రెండు కంటే ఎక్కువ ఇచ్చారని అన్నారు. ఈ విషయమై ఎంపీపీ శరత్‌రావు మాట్లాడుతూ మండలానికి 30 యూనిట్లు మాత్రమే మంజూరయ్యాయని, త్వరలో మరికొన్ని యూనిట్ల మంజూరు కోసం కలెక్టర్‌తో మాట్లాడామన్నారు. అలాగే రత్నాలకుంట పూడ్చివేత, చిల్డ్రన్స్‌పార్క్ పనులకు రూ.50 లక్షలు మంజూరయ్యాయని, పనులు చేపడుతామన్నారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాయుద్ధనౌక గద్దర్‌కు నివాళి



ఎల్లారెడ్డిపేట: దుమాలలో గద్దర్‌కు నివాళి అర్పిస్తున్న గ్రామస్తులు

సిరిసిల్లకల్చరల్: ప్రజాయుద్ధ నౌక గద్దర్‌కు జిల్లా రచయితల వేదిక, ఆల్ సీనియర్ సిటీజన్ల సంఘం మంగళవారం ఘనంగా నివాళి అర్పించింది. గాంధీ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సీనియర్ సిటీజన్ల సంఘం అధ్యక్షుడ చేపూరి బుచ్చయ్య, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: అంబేద్కర్ విగ్రహం వద్ద గద్దర్ చిత్రపటానికి కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్ మంగళవారం పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సెస్ మాజీ డైరెక్టర్ కొమ్ము బాలయ్య, బీఎంఎస్ జిల్లా కన్వీనర్ తోట ధర్మేందర్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లిలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నక్క రవి ఆధ్వర్యంలో ప్రజాగాయకుడు గద్దర్‌కు నివాళి అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గనప శివజ్యోతి, సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్, తంగళ్లపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాలలో అమరుల స్థూపం వద్ద మంగళవారం రాత్రి గ్రామస్తులు ప్రజాయుద్ధనౌక గద్దర్‌కు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కదిరె రజిత, మాజీ సర్పంచ్ గుల్లపల్లి నర్సింహారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



ముస్తాబాద్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు



సిరిసిల్లకల్చరల్: నివాళి అర్పిస్తున్న సీనియర్ సిటిజన్లు

న్యాయం చేయాలని ఆందోళన



మాట్లాడుతున్న రఘుపతి

వేములవాడఅర్బన్: న్యాయం చేయాలని ఓ వ్యక్తి ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగాడు. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన రఘుపతి రెండు నెలల క్రితం తన భార్యను ప్రసవం కోసం వేములవాడ ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చాడు. ఆమెకు శస్త్ర చికిత్స చేయడంతో ఆడ శిశువు జన్మించింది. రెండు గంటల పాటు శిశువును పరిశీలనలో ఉంచాలని వైద్యులు తెలిపారు. తరువాత శిశువును చూపించకుండా పరిస్థితి విషమంగా ఉందని, సిరిసిల్ల ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. తర్వాత సిరిసిల్లలో శిశువును పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. కాగా వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతిచెందిందని కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు రఘుపతి తెలిపాడు. ఈ విషయమై వేములవాడ ఏరియా ఆసుపత్రి పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ పాప మృతి చెందిందని, తమకు న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేశాడు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు



నాగలక్ష్మి

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల నూతన తహసీల్దార్‌గా మంగళవారం సాయంత్రం నాగలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఆమె పెద్దపల్లి జిల్లా కేంద్రంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహించి బదిలీపై వచ్చారు. ఇటీవల తంగళ్లపల్లి తహసీల్దార్‌గా విధుల్లో చేరిన విజయ్ ప్రకాశ్‌రావు సిరిసిల్లకు బదిలీ అయ్యారు.

వేములవాడ రూరల్ తహసీల్దార్‌గా సుజాత



సుజాత

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ తహసీల్దార్‌గా తాళ్ల సుజాత మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేసిన విజయలలిత జగిత్యాల జిల్లా బీర్‌పూర్‌కు బదిలీపై వెళ్లారు. జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రం నుంచి బదిలీపై వచ్చిన సుజాత వేములవాడ రూరల్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

బోయినపల్లి తహసీల్దార్‌గా పుష్పలత



పుష్పలత

బోయినపల్లి: తహసీల్దార్‌గా డీ పుష్పలత బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ నరేశ్ వారం రోజుల క్రితం జగిత్యాల జిల్లా కొడిమ్యాల తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

వీర్నపల్లి: మండల కేంద్రంలో బుధవారం జరగాల్సిన మండల సర్వ సభ్య సమావేశం రద్దయినట్లు ఎంపీడీవో నరేశ్‌కుమార్ తెలిపారు. కోరం లేకపోవడంతో సమావేశాన్ని రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే మరోతేదీని ప్రకటిస్తామన్నారు. దీనిని ప్రజాప్రతినిధులు, అధికారులు, గమనించాలన్నారు.

ఎస్సైగా ఎంపికైన యువతకు సన్మానం



వేములవాడ: స్వాతిని సన్మానిస్తున్న ట్రస్టు సభ్యులు



బోయినపల్లి: సన్మానిస్తున్న కిషన్‌రెడ్డి

వేములవాడ: ఎస్సై పోస్టుకు ఎంపికైన వేములవాడ పట్టణానికి చెందిన కొప్పుల స్వాతిని మై వేములవాడ ట్రస్టు ప్రతినిధులు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు.

బోయినపల్లి: మండలంలోని దుంద్రపల్లి గ్రామానికి చెందిన గుంటి అరుణ్‌కుమార్‌ను కోరెం సింగిల్ విండో చైర్మన్ తీపిరెడ్డి కిషన్‌రెడ్డి, జిల్లా కుర్మ సంఘం అధ్యక్షుడు ఏనుగుల కనుకయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి వేర్వేరుగా సన్మానించారు.

ఎల్లారెడ్డిపేట: ఎస్సై పోస్టుకు ఎంపికైన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన అందె సతీశ్, పిట్ల దీపక్‌ను బీజేపీ మండలాధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, నాయకులు సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

ప్రతిరోజూ డ్రై డే పాటించాలి

ఎల్లారెడ్డిపేట: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతిరోజూ డ్రైడే పాటించాలని వైద్యాధికారిణి స్రవంతిరెడ్డి అన్నారు. మంగళవారం నీటితొట్టిలు, కుండీలు, టైర్లను పరిశీలించి, నిల్వ నీటిని పారబోశారు. ఏఎన్ఎం అమృతవల్లి, ఆశ కార్యకర్త రజిత, అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అబాకస్ దినోత్సవం

ఇల్లంతకుంట: స్థానిక వాణి నికేతన్ పాఠశాలలో ప్రపంచ అబాకస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనిధి, పాల్గొన్నారు.

గృహలక్ష్మికి దరఖాస్తుల ప్రవాహం

తంగళ్లపల్లి: ప్రభుత్వం ఇళ్లలేని నిరుపేదలకు గృహలక్ష్మి పథకం ద్వారా సొంతింటి కలను నెరవేర్చేందుకు దరఖాస్తులు ఆహ్వానించగా తంగళ్లపల్లి ఎంపీడీవో కార్యాలయానికి మంగళవారం 250 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో పి.లచ్చాలు తెలిపారు.

ఆలయంలో బోరుమోటారు ప్రారంభం

ముస్తాబాద్: స్థానిక శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో ఎంపీపీ జనగామ శరత్‌రావు మంగళవారం బోరుమోటారు ప్రారంభించారు. భక్తుల సౌకర్యార్థం, విశ్రాంతి గదికి అవసరమైన బోరును ప్రారంభించినట్లు తెలిపారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

ముస్తాబాద్: మండల కేంద్రంతో పాటు, తెర్లుమద్ది, బందనకల్, మొర్రాయిపల్లె గ్రామాల్లో కల్యాణలక్ష్మి చెక్కులను ఎంపీపీ జనగామ శరత్‌రావు మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచులు సుమతి, కిషన్‌రావు, వెంకటేశ్వరి, సుజాత, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, ఉపసర్పంచ్‌లు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బుగ్గరాజేశ్వరతండా, దేవునిగుట్టతండా, బండలింగంపల్లిలో లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను సర్పంచులు అజ్మీర రజిత, పెంటయ్య, కొత్తపల్లి వాణి పంపిణీ చేశారు జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు తిరుపతినాయక్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి గ్రామంలో పలువురు లబ్ధిదారులకు సర్పంచ్ శివజ్యోతి ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నాగం లక్ష్మికి రూ.60 వేలు, పిట్ల రాజుకు రూ.39 వేలు, దూస లత రూ.10 వేలు అందజేశారు.

పరామర్శ

వీర్నపల్లి: ఆదిలాబాద్ జిల్లాలో ప్రమాదవశాత్తు మృతి చెందిన మండలంలోని రంగంపేట గ్రామ మాజీ సర్పంచ్ ఉస్మాన్ తనయుడు పీజీ వైద్య విద్యార్థి భూక్య ప్రవీణ్ కుటుంబసభ్యులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పరామర్శించారు. ప్రభుత్వం తరుపున ఆదుకుంటామన్నారు. జిల్లా కోఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా పాల్గొన్నారు.